క్లుప్తంగా

వేంకటశాస్త్రికి సత్కారం



నర్సాపురంలో న్యాయమూర్తి కృష్ణమోహన్, ప్రవచనకర్త శర్మలతో వేంకట శాస్త్రి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వేదపండితుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న చింతా వేంకట శాస్త్రికి ఆదివారం నర్సాపురంలో వేద, స్మార్త పండిత సభ ద్వారా సత్కారం చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణ మోహన్, టీటీడీ దేవస్థానం ప్రవచనకర్త ఆకెళ్ళ విభీషణశర్మలు ఈ మేరకు వేంకటశాస్త్రికి సువర్ణ హస్త కంకణ ధారణ చేశారు. నర్సాపురం పట్టణ పురోహితుడు అంగర సత్యానారాయణ, వారి సోదరుల ఆధ్వర్యంలో పై సత్కారం నిర్వహించారు.

కేశనపల్లి హాస్టల్ తనిఖీ



హాస్టల్‌లో విచారణ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను ఆదివారం రెవెన్యూ, విద్యాశాఖాధికారులు తనిఖీ చేశారు. గత శుక్రవారం హాస్టల్‌లో భోజనంలో సీసా పెంకులు ఉన్నాయని విద్యార్థుల బంధువులు ఆందోళన చేశారు. అవి సీసా పెంకులు కాదని పాలిథిన్ కవర్ ముక్క అని హాస్టల్ సిబ్బంది పేర్కొంటుండగా ఆదివారం అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంఈఓ సత్యనారాయణ, ఆర్.వేణులతో పాటు సర్పంచ్ యెనుముల నాగు ఉన్నారు. విద్యార్థులు, వారి బంధువులతో మాట్లాడిన అనంతరం విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ వేడి నీళ్ల పడి గాయపడిన బాలుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.18 వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్టు సంస్థ సభ్యులు ఆదివారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం దర్శిపర్రుకి చెందిన 22 నెలల బాలుడు వరికూటి రాజేష్ రెండు వారాల క్రితం వేడి నీళ్లల్లో చేతులు పెట్టడంతో రెండు చేతులు తీవ్రంగా కాలిపోయాయి. వైద్యానికి రూ.2 నుంచి 3 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. కూలి పని చేసుకునే బాబు తండ్రికి అంత స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో బాబు తండ్రి ఏసుబాబుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.18 వేల చెక్కు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వరద వెంకట రామ లింగేశ్వర రావు, విశాలాక్షి దంపతులు రూ.10,116, అమలాపురానికి చెందిన తాటిపర్తి వెంకటరమేష్, ఉదయ భానులక్ష్మి దంపతులు రూ.10,116 ఆదివారం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవ గోపాలస్వామి ఆలయ అభివృద్ధికి, అన్నప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసినట్టు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన చింతా ఎనివాసరెడ్డి, కనకదుర్గ దంపతులు రూ.11,116, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన రావిపూడి వెంకటసుబ్బారావు, సుశీల దంపతులు రూ.10,116, హన్మకొండకు చెందిన తేజావత్ నిఖిల్ కుటుంబ సభ్యులు రూ.10,010 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరపున అధికారులు, వేదపండితులచే ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ప్రమాణ స్వీకారానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడి బైరిశెట్టి రాంబాబుతో పాటు సభ్యులుగా అయినవిల్లి వీవీ సత్యనారాయణమూర్తి, కట్టా శ్రీనివాస్, ద్విభాష్యం సత్యలక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మి, సబ్బవరపు రామాయమ్మ, బొబ్బా రాంబాబు, కొప్పడి జయబాబు, డి.దుర్గాభవాని ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. అలాగే అలాగే ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు కె.సత్యప్రభాకరాచార్యులు ప్రమాణం చేశారు.

చవితికి సిద్ధమైన గణనాథులు

- 27 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- మట్టి బొమ్మలతోనే పర్యావరణానికి మేలు



ఇరుసుమండలో మట్టి ప్రతిమను సర్పంచ్ నాగవేణికి అందిస్తున్న సతీష్



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా బొజ్జ గణపయ్యలు



ఆలమూరులో వ్యయ ప్రయాసలతో తీర్చిదిద్దిన మట్టి విగ్రహం (ఫైల్)



పాశర్లపూడిలో ఉచితంగా మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



ర్యాలిలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న కాశిరెడ్డి, శ్యామ్

ఆలమూరు: విఘ్నాలు తొలగించి విజయాలను అందించే వినాయకుడి చవితికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్ర మహోత్సవాల్లో బొజ్జ గణపయ్యకు భక్తి పారవశ్యంతో పూజలు చేసేందుకు భక్తులు పూజా ద్రవ్యాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. హిందువులకు పవిత్రమైన వినాయకచవితిని పురస్కరించుకుని చేపట్టనున్న నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు వాడవాడలా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ విద్యార్థుల నుంచి వ్యాపార వేత్తల వరకూ ఏటా అట్టహాసంగా జరుపుకొనే ఈ పండుగకు దేశంలోనే ప్రత్యేక స్థానముంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో సుమారు 1500 పైగా గణనాథుల్ని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద చలువ పందిళ్లతో, విద్యుత్‌లంకరణతో ముస్తాబవుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవ కమిటీలు గణపతి విగ్రహాలను మండపాలకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మట్టి విగ్రహాలనే పూజించాలని ప్రభుత్వం, ప్రసార సాధనాలు ఏకరవు పెడుతున్నా తయారీ లేక ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలనే భక్తులకు కొనుగోలుకు మొగ్గు చూపుతుండటం పరిస్థితికి అద్దం పడుతుంది.

మట్టి విగ్రహాలే మేలు

పూర్వం బంక మట్టి, ఖద్దరు, రంగులతో వినాయక విగ్రహాలను తయారుచేసేవారు. దీంతో గణపతి ఉత్సవాలు పూర్తయిన తరువాత నిమజ్జనం చేస్తే త్వరితగతిన కరిగిపోయి పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. పీఓపీ ద్వారా తయారు చేసే రసాయనాల్లో ఎక్కువగా కాల్షియం సల్ఫేట్ హెమిహైడ్రేట్ రసాయనాలు ఉండటం వల్ల నీరు కాలుష్యమవుతుంది. నేటి ఆధునిక ప్రపంచంలో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇనుము, రసాయనాలు, ప్లాస్టిక్ పదార్థాలను బొమ్మల తయారీలో వినియోగిస్తున్నారు. దీంట్లో ఉన్న మిశ్రమాలు నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది.

నిబంధనలు పాటించాలి

గణపతి నవరాత్ర ఉత్సవాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఆలమూరు ఎస్సై జి.నగేష్ అన్నారు. మండలంలోని చెముడులంకలో నవరాత్రి వేడుకల నిర్వహణపై శనివారం రాత్రి పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ గణనాథుల మండపాల్లో డీజేలు ఏర్పాటు చేసేందుకు అనుమతి లేదన్నారు. లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించవద్దని విజ్ఞప్తి చేశారు, వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసుకునే గణపతి మండపాలకు సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. గణేశుని నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను పోలీసులకు ముందుగా తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

మట్టి గణపతిని పూజిద్దాం

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మట్టి గణపతిని పూజించి నీటి కాలుష్యాన్ని నివారిద్దామని జిల్లా పంచాయతీ రాజ్ డీఈ అన్యం రాంబాబు, అంబాజీపేట సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు అన్నారు. ఇరుసుమండలో కోనసీమ ఆహారనిధి వ్యవస్థాపకుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం భక్తులకు పంపిణీ చేశారు. సతీష్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా మట్టి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తున్నామన్నారు. పర్యవరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, అక్కిశెట్టి పెద్ద, ఆహార నిధి ప్రతినిధులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం సూచించారు. పాశర్లపూడిలో ఆదివారం అక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మట్టి గణపతుల ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. 'మట్టి గణపతి–మన గణపతి' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మట్టి గణపతులను పూజించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వాండ్రాసి రాజేష్, కటికిరెడ్డి శివ నాగేంద్ర, కంకిపాటి శ్రవణ్, సూర్య పాల్గొన్నారు.

గణపయ్యల కనువిందు

అంబాజీపేట: తెలుగువారి తొలిపండగ విఘ్నాలు తీర్చే వినాయక చవితి వచ్చేస్తోంది. పూజలు అందుకునేందుకు గణనాథులు సిద్ధమవతున్నారు. గణపయ్యను కొలిచేందుకు మన సారా, పూజాధికాలు చేయాలనే సంకల్పంతో ప్రతి ఇంటా, వాడావాడలా ఉత్సవాలు చేసేందుకు ఉత్సవ కమిటీలు ఇప్పటికే గ్రామాల్లో పందిరిరాట వేసి పనుల్లో నిమగ్నమయ్యారు. అంబాజీపేట మండలంలో రాజస్తానీయులు బొజ్జ గణపయ్యను వివిధ ఆకృతుల్లో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవ కమిటీలు తమకు నచ్చిన విధంగా విగ్రహాలు తయారు చేయించుకుంటున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో వివిధ రూపాల్లో చిన్న సైజు నుంచి 9 అడుగుల ఎత్తు విగ్రహాలను వివిధ రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. వీటి విలువ సైజును బట్టి రూ.2 వేలు నుంచి రూ.50 వేల వరకు ఉంది. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది విగ్రహాల ధరలు పెరిగాయి.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: స్థానిక గరుడేశ్వర స్వామి వారి ఆలయం వద్ద బాలగణపతి స్వామి యువజన సంఘం, శివాలయం సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి నవరాత్ర మహోత్సవాల కోసం పందిరి రాటకు ముహూర్తం చేశారు. నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు యూత్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ర్యాలిలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

కొత్తపేట: పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా రానున్న వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరూ మట్టి గణనాథుని మాత్రమే పూజించాలని ఆత్రేయపురం మండలం ర్యాలి ఎంపీపీ మెయిన్ ఫౌండేషన్ స్కూల్ హెచ్‌ఎం, అనూస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు చింతా శ్యామ్‌కుమార్ పిలుపునిచ్చారు. ర్యాలి గ్రామంలోని అన్నపూర్ణ డే కేర్ హోమ్ వద్ద చిన్నారులకు మట్టి గణపతి ప్రతిమలు ఎలా తయారు చేసుకోవాలో అనే అంశంపై మట్టి విగ్రహాల తయారీ కళాకారుడు మూర్తి ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. కేఎస్‌ఆర్ టెంట్ హౌస్ అధినేత వెలగల కాశిరెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు సమకూర్చగా అన్నపూర్ణ డే కేర్ హోమ్ వద్ద శ్యామ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

శాంతించిన గోదారమ్మ

కాజ్‌వేలను వీడని వరద



అప్పనపల్లి కాజ్‌వేపై ప్రవహిస్తున్న గోదావరి వరద

మామిడికుదురు: లంక గ్రామాలను గోదావరి వరద ఇంకా వీడలేదు. తీర గ్రామాలకు వెళ్లే ప్రధాన కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉంది. దీంతో వరద నీటిలో దిగి స్థానికులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అప్పనపల్లి కాజ్వే ఆదివారం ఇంకా ముంపు నీటిలోనే ఉంది. దీనిపై అగుడున్నర మేర వరద నీరు ప్రవహిస్తోంది. ఈ వరద నీటిలోనే దిగి అష్టకష్టాలు పడుతూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి ఉచ్చులవారిపేట మీదుగా మొల్లేటివారిపాలెం వెళ్లే సీసీ రోడ్డు పూర్తిగా ముంపు నుంచి తేరుకుంది. దీంతో ఈ మార్గం మీదుగా అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. ఫోర్ వీలర్స్ సైతం ఇదే మార్గంలో వెళ్తున్నాయి. వరద కష్టాల నుంచి తీర గ్రామాల ప్రజలకు శాశ్వత విముక్తి కలిగించే దిశగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని లంక గ్రామాల వాసులు వేడుకుంటున్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: గౌతమీ గోదావరికి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. దీంతో లంక పరివాహక ప్రాంతాల్లో సాధారణ పరిస్థితికి చేరుకుంటున్నాయి. గత వారం రోజుల నుంచి ఉగ్రరూపం దాల్చిన గౌతమీ గోదావరి ఇప్పుడిప్పుడే శాంతిస్తుంది. బడుగువాని లంకలోని కొన్ని లంక భూముల్లో ఇప్పటికే చేరుకున్న వరద నీరు క్రమేపీ తగ్గుతూ వస్తుంది. బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు వరద ముంపు తప్పింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు బారీగా తగ్గుముఖం పట్టడంతో గోదావరికి వరద ప్రభావం లేదని అధికారులు భావిస్తున్నారు.

కాజ్‌వేపై కొనసాగుతున్న వరద

అయినవిల్లి: మండలంలోని లంక గ్రామాల్లో వరద శాంతించింది. వరదనీటి ప్రవాహం ఇంకా లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో కొనసాగుతుంది. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే వరద కొనసాగుతోంది. వరదతో కొట్టుకొచ్చిన చెత్త, బురదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు మూడు రోజుల్లో యథాస్థితి కొనసాగుతుందని అధికారులు తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, అలాగే వేడి వేడిగా ఉండగానే ఆహారాలు తినాలని వైద్యులు సూచిస్తున్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..



కొత్తపేటలో పూర్వ సీఈసీ గ్రూపు విద్యార్థులు

కొత్తపేట: చదువులమ్మ చెట్టు నీడలో కలసిమెలసి చదువుకున్న నాటి బాల, బాలికలు నేడు గోల్డెన్ జూబ్లీ మీట్ పేరుతో మళ్లీ కలుసుకున్నారు. 70కి చేరుకుంటున్న దశలో వారందరూ ఉత్సాహంగా తరలివచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారు కూడా రెక్కలు కట్టుకుని ఆనాడు చదువుకున్న చదువులమ్మ చెట్టు నీడకు వచ్చి వాలారు. తమ క్లాస్‌మేట్స్‌తో ఆనందానుభవాలను పంచుకున్నారు. పిల్లలుగా మారి ఉత్సాహంగా ఆటలు, పాటలు పాడారు. అందుకు కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, ఆర్‌ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు వేదికలయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 1972–74 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం చైర్మన్‌గా, ఏబీ బాని కన్వీనర్‌గా 9 మంది సభ్యులతో కోర్ కమిటీగా ఏర్పడి వారి నేతృత్వంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాంగణానికి వస్తూవస్తూనే పరస్పరం ఆలింగనం చేసుకుని క్షేమ సమాచారాలు, పిల్లలు, మనుమల విషయాలు తెలుసుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన నాటి జ్ఞాపకాలు, స్నేహ సంబంధాలు, ఆనంద క్షణాలు నెమరువేసుకున్నారు. ఈ వేడుకలు ఉదయం నుంచి రాత్రి వరకు ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించగా అందరూ ఆనందడోలికల్లో తేలియాడారు. కార్యక్రమంలో కోసూరి ప్రసాద్‌వర్మ, సత్యవరపు సత్యనారాయణ, కీతినీడి సత్యనారాయణ, పప్పుల వీరభద్రరావు, నిట్టల సుబ్బలక్ష్మి, జి.సితాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం



ఆలమూరులో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సిన ప్రభుత్వం ఏకపక్షంగా ఏళ్ల తరబడి ఉన్న దివ్యాంగుల పింఛన్లను తొలగించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. ఆలమూరులో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు వచ్చి కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలమైన తీరును వివరించారు. ఈసందర్భంగా పింఛన్‌ను తొలగించబడిన బాధితులు తమ సమస్యలను మండల కన్వీనర్ తమ్మన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్‌దారులెవరూ ఆందోళన చెందవద్దని రాబోయే కాలంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి నేతలు చేసిన తప్పులను సరిదిద్దుతామని వ్యాఖ్యానించారు. పార్టీ నేతలు నామాల శ్రీనివాసు, గుణ్ణం రాంబాబు, నాయుడు ప్రసాద్, కొప్పనాతి శ్రీనివాసు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, కోలా నాని, నాతి కుమార్‌రాజా, చిన్నం వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

అర్హతలున్నా పింఛన్లు పీకేశారు

అంబాజీపేట: అన్ని విధాలా అర్హతలు ఉన్నా తమ పింఛన్లను కూటమి ప్రభుత్వం పీకేసిందని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగ పింఛన్ రూ.6 వేలకు పెంచామని గొప్పలు చెప్పుకుంటూనే మండలంలో 102 మంది అర్హులను అకారణంగా తొలగించేశారని పింఛనుదారులు విమర్శిస్తున్నారు. రీ వెరిఫికేషన్ పేరిట పరిశీలన చేసి పింఛన్లు రద్దు చేసి అనర్హులుగా నోటీసులు పంపడంతో అవాక్కయ్యారు. దీంతో బాధితులు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమకు అన్యాయం చేయవద్దని వైకల్యం చూసి కనికరించాలని వేడుకుంటున్నారు.

సత్యనారాయణకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న ఆదిత్యకుమార్ తదితరులు

మామిడికుదురు: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత కురసాల కన్నబాబును మామిడికుదురు గ్రామానికి చెందిన మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్ ఆదివారం పరామర్శించారు. కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. కన్నబాబును ఓదార్చారు. పార్టీ నేతలు కూనపరెడ్డి రాంబాబు, తులా గోపాలకృష్ణ, వర్థినేని రాము, సలాది సతీష్, గొలకోటి ప్రకాష్, ఏడిద లక్ష్మణరావు, తదితరులు కన్నబాబును పరామర్శించారు.

పలువురికి జాతీయ సేవా పురస్కారాలు



అవార్డు అందుకున్న పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



పురస్కారం అందుకున్న దుళ్ళ వెంకటేశ్వర్లు







జాతీయ సేవా పురస్కారాలు అందుకున్న సత్యనారాయణ, భీమాల వెంకటేశ్వరరావు, కోరుకొండ జాన్, సాయిసీత

రావులపాలెం/కొత్తపేట/మామిడికుదురు/పి.గన్నవరం: స్థానిక మదర్‌థెరిసా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ వార్షికోత్సవం, మదర్‌థెరిసా జయంతి సందర్భంగా పలువురికి జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ పురస్కారాలను శిల్ప వడయార్ చేతుల మీదుగా అందజేశారు.

డీఎస్సీలో అభ్యర్థుల ప్రతిభ



పేరూరి దుర్గాప్రసాద్



చిట్టూరి స్వప్న



కర్రి దుర్గాకృష్ణమనాయుడు



యేడిద దుర్గా నాగబాబు

రాజోలు: డీఎస్సీ పరీక్షల్లో రాజోలు మండలానికి చెందిన పలువురు అభ్యర్థులు ప్రతిభ చాటారు. పాలగుమ్మి గ్రామానికి చెందిన పేరూరి దుర్గాప్రసాద్ సూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో 14వ ర్యాంక్ సాధించారు. అలాగే గ్రామానికి చెందిన చిట్టూరి స్వప్న జిల్లా స్థాయిలో 84.6 మార్కులు సాధించి ఎస్జీటీ పోస్టుకు ఎంపికైంది.

వీరిద్దరిని పాలగుమ్మికి చెందిన ఉపాధ్యాయులు పలువురు అభినందించారు. రాజోలు గ్రామానికి చెందిన కర్రి దుర్గాకృష్ణమనాయుడు స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో 15వ ర్యాంక్ సాధించారు.

ప్రస్తుతం ఈయన నగరం గ్రామసచివాలయంలో ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. వీరితో పాటు మెరకపాలెం గ్రామానికి చెందిన యేడిద దుర్గా నాగబాబు స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా స్థాయిలో 49వ ర్యాంక్ సాధించారు.

ఇమామ్ అలీ రజాకు ఘన నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం 8వ ఇమామ్ హజరత్ అలీ రాజకు ఆదివారం ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. దీనిలో భాగంగా మామిడికుదురు ఇమామ్ అలీ రజా పంజాలో మజ్లిస్‌లు జరిగాయి. మజ్లిస్‌లో భాగంగా మౌలానా సయ్యద్ అంజద్ అలీ జైదీ ఇరాన్‌లోని మషద్ పట్టణంలో ఇమామ్ అలీ రజా వీర మరణం పొందిన సంఘటనలను భక్తులకు వివరించగా భక్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మజ్లిస్ అనంతరం గుమ్మటాన్ని తీసి గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. నగరంలోని పంజీషా వరకు గుమ్మటం ఊరేగింపు జరిగింది. పంజా ముతవల్లీ సర్కిల్ ఫకర్ సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలి

మలికిపురం: ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్‌పై విమర్శలు రావడం విచారించదగ్గ విషయమని, ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధంగా ఉండాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఆదివారం మలికిపురం పూలే–అంబేద్కర్ భవన్‌లో 'భారత ఎన్నికల వ్యవస్థ– ఎన్నికల కమిషన్ తీరు తెన్నుల'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి స్వేచ్ఛ స్వతంత్ర భావ ప్రకటన వేదిక నాయకులు జనిపల్లి సత్యానందం, ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్ష కార్యదర్శులుగా వ్యవహరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

బాక్సింగ్ విజేతలకు అభినందనలు



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న అధ్యాపకులు

రాజోలు: 'అమరావతి చాంపియన్ షిప్ ట్రోఫీ' జోనల్ స్థాయిలో ఈ నెల 23న కాకినాడలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ బి.సాయిబాబు అభినందించారు. బాక్సింగ్‌లో ప్రతిభ చూపిన ఐ.సుదీర్, బి.మోహన్ రాజు, ఎం.స్వర్ణన్ రాజు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 25, 26, 27 తేదీల్లో తిరుపతిలో జరుగుతాయి. స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎన్.రాజు, పీడీ బి.మధు కుమార్‌లు క్రీడాకారులను అభినందించారు.